క్లుప్తంగా

రేపటి ప్రజా వేదిక ధర్నాలను జయప్రదం చేయాలి

తెనాలి: ట్రూఅప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపడాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని.. తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఛార్జీల భారం, స్మార్ట్ మీటర్లు తదితర సమస్యలపై మంగళవారం ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. గత 36 నెలల నుంచి 2014–19 కాలానికి సంబంధించిన రూ.3 వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక 2022–23, 2023–24 సంవత్సరాలకు రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారం మోపినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు చెల్లించిన అయిదేళ్ల తర్వాత ఆదాయ, వ్యయాల మధ్య లోటు పేరుతో ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసే విధానమే అక్రమమని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



తెనాలి అర్బన్: నివాస్ కరాటే మార్షల్ అకాడమి ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం కొలవరం గ్రామంలో బెల్ట్ గ్రేడింగ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్ట్‌లను తెనాలి టూ టౌన్ సీఐ రాములనాయక్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాతళ్లపల్లి సాంబశివరావు, పి.మాలకొండంరాజు, అకాడమి అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కె.కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుల్లియ్య సేవలు చిరస్మరణీయం



తెనాలి టౌన్: కాంగ్రెస్ పార్టీ తెనాలి మండల అధ్యక్షుడిగా కర్లపూడి బుల్లియ్య సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం బుల్లియ్య సంతాప సభ నిర్వహించారు. సాంబశివుడు పాల్గొని బుల్లియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కర్లపూడి ధనరాజు, శ్రీనివాసరావు, రత్నకుమార్, మనోహర్, వెన్నెల, పెనుగొండ శివకుమార్, మల్లవరపు ప్రసాద్, స్టీవెన్‌బాబు, రాయప్ప, రమేష్, అయ్యప్ప, కోటేశ్వరరావు, వీరాస్వామి, శ్రీను, కార్తీక్, అఖిల్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం



తెనాలి టౌన్: విద్యతోనే సామాజిక మార్పు సాధ్యపడుతుందని యంగ్ జనరేషన్ టి.ఫౌండర్ షేక్ సాధిక్ పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటకు చెందిన ఆటో డ్రైవర్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గుర్తించి వారి ఇద్దరి పిల్లలను చదివించేందుకు తమ టీమ్ ముందుకు వచ్చింది. ఆదివారం షేక్ సాధిక్ అండ్ టీమ్ మహేష్, బిందు చిన్నారుల చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్‌లో వారి చదువుకు అవసరమైన విద్య ఖర్చులను పూర్తిగా భరిస్తామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యంగ్ జనరేషన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి సారె సమర్పణ



మంగళగిరి: మండలంలోని యర్రబాలెం అద్దంకి ఆలా వారి గంగమ్మతల్లి గుడిలో సారె మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, బొల్లె ఆవులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. మేళతాళాలు, కనక తప్పెట్లు, డీజేలతో సారెకు గ్రామోత్సవం నిర్వహించారు.

అశోక్‌బాబుకు పలువురి పరామర్శ



వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబును పరామర్శిస్తున్న గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

రేపల్లె: తూటికాడను తొలగించి రైతులకు మేలు చేయాలని కోరుతూ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు చేపట్టిన దీక్షను అడ్డుకునే నెపంతో పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి దాడి చేయటాన్ని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం చేరి చికిత్సను నిరాకరిస్తూ దీక్ష కొనసాగిస్తున్న అశోక్‌బాబును ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జనరల్ సెక్రటరీ అంజని ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మేకతోటి దయాసాగర్‌లతో పాటు పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు ఆయనను పరామర్శించి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.



అశోక్‌బాబును పరామర్శిస్తున్న కోకి రాఘవరెడ్డి, జనరల్ సెక్రటరీ అంజని ప్రసాద్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొలకలూరు కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976–77 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని.. 47 ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఆత్మీయ కలయిక నిర్వహించడం సంతోషంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సహ విద్యార్థులలో అసువులు బాసిన కొందరు స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆనాటి గురువులైన జి.కోటేశ్వరరావు, ఉమాదేవి, సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. ఈ పూర్వ సమ్మేళనానికి కృషి చేసిన సీహెచ్ భాస్కరరావు కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.నటరాజు, జి.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసమూర్తి, వెంకటరమణ, నరసింహారావు, డాక్టర్ తాడిబోయిన సాంబశివరావు, వనజ, పద్మశ్రీ, ఉషారాణి, ఉమాకుమారి, వెంకటరమణమ్మ, ఉదయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో..

తెనాలి: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో 1979–82లో బీకాం చదివిన విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత ఆదివారం మళ్లీ అదే కాలేజీలో కలుసుకున్నారు. విద్యాభ్యాసం తర్వాత రకరకాల వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడినవారు.. ఉద్యోగ జీవితం నుంచి రిటైర్ అయినవారు ఆ సమావేశంలో పాల్గొని తమ నేస్తాలను ఆత్మీయంగా పలకరించుకున్నారు. పలువురు తమలోని కళాసృజనను ప్రదర్శించి, అభినందనలు అందుకున్నారు. అప్పటి గురువులు నన్నపనేని ముకుందరావు, కోడూరి మల్లికార్జునరావు, అల్లం సత్యనారాయణ, జానకి రామయ్య, అమిరినేని శివప్రసాద్‌లను ఆహ్వానించి పూర్వ విద్యార్థులంతా కలిసి వారిని ఘనంగా సత్కరించారు. వచ్చే ఏడాది కళాశాలలో జరిగే వజ్రోత్సవ వేడుకల్లో మీరంతా పాల్గొనాలని కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు



తాడికొండ: ఓ వ్యక్తిపై ఐదుగురు యువకులు దాడి చేసిన ఘటనలో తుళ్ళూరు పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన తుళ్ళూరు మండలంలోని తాళ్ళాయపాలెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దున్నా బాలకోటయ్యపై అదే గ్రామానికి చెందిన యువకులు కిరణ్, నరేష్, రాజీ, ప్రవీణ్, మరియదాసులు గత రెండు రోజుల క్రితం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దున్నా బాల కోటయ్య తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు



దుగ్గిరాల: ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పి.నతానియేలు మాదిగ అన్నారు. దుగ్గిరాల గ్రామంలో ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం నతానియేలు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుల నిర్ణయం మేరకు ప్రతి గ్రామంలో నిర్మాణాత్మక కమిటీలను వేస్తున్నామని అన్నారు. ఈ నెల 22న జరగనున్న నూతన కమిటీల మహాసభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.సుధీర్ మాదిగ, జి.కిరణ్ మాదిగ, వై.జ్యోతి మాదిగ, డి.సాంబయ్య మాదిగ, కె.నాగేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు.

బదిలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న బదిలీ కార్మికులు, ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ కార్మికుల జీతాలలో ఏడాదికి రూ.కోటికి పైగా కాంట్రాక్టర్ దోపిడీ చేస్తున్నారన్నారు. వాస్తవంగా కార్మికులకు రూ.15,000 మున్సిపాల్టీ ఇస్తుందని, కాంట్రాక్టర్ రూ.10 వేలు మాత్రం ఇచ్చి రూ.5 వేలు దోచుకుంటున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న కేబీ ప్రసాద్



రైతులతో సంతకాలు చేయిస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లను ప్రజలందరూ అడ్డుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బి.ప్రసాద్ సూచించారు. చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను కష్టాల్లోకి కూటమి ప్రభుత్వం నెడుతుందని ఆరోపించారు. వీటిని ఏర్పాటు చేయడంతో బిల్లులు కూడా అదనంగా వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, అహ్మద్ హుస్సేన్, పి.జోసేఫ్, కె.లక్ష్మణరావు, ఎం.ఉమామహేశ్వరరావు, జి.సుబ్బారావు, జి.వెంకటసుబ్బయ్య, జి.రవీంద్ర, ఎస్.సుబ్రహ్మణ్యం, కె.శివశంకరరావు, కె.దుర్గాప్రసాద్, కటకం సాంబశివరావు, ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, ఎన్.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి: విద్యుత్ పంపిణీ మొత్తాన్ని అదానీ కంపెనీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. దీంతో రైతులు, ఎస్సీ ఎస్టీ గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సౌకర్యం రద్దవుతుందని చెబుతూ.. అంతా కలిసి ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం గుడివాడ గ్రామంలో సంతకాల సేకరణలో భాగంగా ఆయన రైతులు, కౌలు రైతులని కలిసి సంతకాలు చేయించారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, బురదగుంట భాస్కరరావు, తురకా బాబు, బురదగుంట పిచ్చయ్య, బండి మార్కు, కసుకుర్తి ప్రసాదరావు, పాందుగల పోలేసు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రారంభం



లెర్నథాన్ ప్రాజెక్టును నిపుణుల సహకారంతో ప్రారంభిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ డివిజన్ ఆధ్వర్యంలో స్కిల్ పలావర్ ప్రాజెక్టును విజయవంతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ పలావర్ ప్రాజెక్ట్ ఆధారిత లెర్నింగ్ కార్యక్రమాన్ని బీటెక్, బీసీఏ, ఎంసీఏ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని అన్నారు. స్పెషలైజేషన్ ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు, ఇండస్ట్రీ అలైండ్ స్కిల్ కోర్సులకు అనుగుణంగా హ్యాకథాన్‌లను విద్యా విధానంలో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని అన్నారు. స్కిల్ పలావర్ మూడు దశల విధానాన్ని అనుసరిస్తుందన్నారు. లెర్నథాన్ పరిశ్రమ నిపుణుల చేత యదార్థ సమస్యలపై ఇంటరాక్టివ్ సెషన్లు, వర్చువల్ రివ్యూలు, సెమిస్టర్ మధ్యలో డొమైన్ నిపుణుల ద్వారా ప్రోగ్రెస్ ఈ వాల్యూయేషన్ చేయించడం వంటివి వివరించారు. సుమారు 1650 మంది ప్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ లెర్నథాన్‌లో ప్రముఖ పరిశ్రమ నిపుణులు జి.అనిల్‌కుమార్ (సిస్కో), పి.తత్తమ్మదొర (ఐబీఎం), జి.నాగసాయిరామ్ (అన్సిస్), అనీష్ (అద్యా స్కిల్స్) తదితరులు విద్యార్థులకు సమస్యల సాంకేతిక అవరోధాలపై వివరణాత్మక శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమ మార్గదర్శకులుగా ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రామకృష్ణ రావు, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, మెకానికల్, ఐవోటీ, బీసీఏ, ఎంసీఏ విభాగాల విభాగాధిపతులు సమన్వయ బృందంగా పనిచేశారని తెలిపారు. ఈ స్కిల్ పలావర్ మొదటి దశతో ప్రారంభమై రెండు దశలు ఆగస్టు నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, శాశ్వత మార్గదర్శకత్వం అందించారు.

మందు బాబులకు అడ్డాగా తెనాలి ఫ్లైఓవర్

మంగళగిరి: తెనాలి ఫ్లై ఓవర్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. చీకటి పడినప్పటి నుంచి మందు బాబులు ఫ్లై ఓవర్‌పై మద్యం సేవిస్తూ హల్ చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు మందుబాబులు మద్యం తాగుతూ అటుగా వెళ్లే వాహనదారులు, మహిళలను కామెంట్‌లు చేస్తూ హేళన చేస్తున్నారు. యువకులు అధికంగా పుట్టిన రోజులు సైతం జరుపుకొంటూ తెల్లవార్లూ అక్కడే అల్లరి చేస్తున్నారు. దీంతో చీకటి పడితే తెనాలి మీదుగా వెళ్లి, వచ్చే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు అంబరీషుడు

తెనాలి: ఉపాధ్యాయవృత్తిలో 41 ఏళ్లు బాధ్యతాయుతంగా పనిచేసి పదవీ విరమణ చేసిన కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయుడు ఎనికపల్లి అంబరీషుడు ఆదర్శప్రాయులని ఎస్టీయూ–ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉద్యోగ విరమణ సత్కార సభలో వక్తలు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని రాధామాధవ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటైన సభకు ఎస్టీయూ తెనాలి ఏరియా కార్యదర్శి డీవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడుగా, ఎస్టీయూ సంఘ నేతగా అంబరీషుడు విజయవంతంగా పని చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్టీయూ–ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, ఎం.శ్రీధర్, ఏవీ గోపాలరావు, ఎల్.వీరాంజనేయులు, యు.చంద్రజిత్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తాడిబోయిన హరిప్రసాద్, కౌన్సిలర్లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, జి.మానసరెడ్డి, ఎంఈవో వి.జయంతిబాబు, పట్టణ ప్రముఖులు తోటకూర రమణారావు, తాడిబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ ఈవూరి శ్రీకాంత్, డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ బి.సాంబిరెడ్డి, ఎనికపల్లి అనిల్‌కుమార్, అపర్ణస్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ ఆధ్వర్యంలో అంబరీషుడు దంపతులకు సత్కారం

17 నుంచి శ్రీవారాహి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

తెనాలి: కొల్లిపర మండల గ్రామం కుంచవరంలోని పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ క్యాంపస్–2లో శ్రీవారాహి దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సొసైటీ డైరెక్టర్ డీఎల్ చక్రధర చౌదరి, దేవస్థానం కమిటీ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, టి.నాగమల్లీశ్వరి దేవి, దేవతి భాస్కరరావు, హరిదాసు గౌరీశంకర్, గ్యాలం వేణు, శిల్పాల శ్రీనివాసు, గోపు రామకృష్ణ, మారుతీప్రసాద్, రాజేశ్వరరావు, గుర్రం హరికృష్ణ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న బాలస్వామీజీ

10న రాత పుస్తకాలు పంపిణీ

తెనాలి: వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పేద బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. 10న మధ్యాహ్నం 3 గంటలకు నాజరుపేట అనుగోల వారి వీధిలోని విద్యాశంకర భారతి నృసింహసదన భవనంలో కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆదివారం సమాఖ్య కార్యాలయంలో ఆవిష్కరించారు. పట్టణ, పరిసర గ్రామాల్లోని ఒకటి నుంచి పీజీ వరకు చదివే పేద బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ఉచితంగా నోట్ బుక్స్ అందజేస్తామని తెలిపారు. మండల తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, భవన నిర్మాణానికి సహకరిస్తున్న కాశీనాథుని సుబ్రహ్మణ్యశాస్త్రిని అదే వేదికపై సత్కరిస్తామని వివరించారు. విద్యార్థులు ఈనెల 8వ తేదీలోగా నోట్ బుక్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌరవాధ్యక్షుడు భాగవతల కామేశ్వరరావు, కోశాధికారి తిరుమలరావు, ఉపాధ్యక్షుడు కుందేటి వెంకట సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి టి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు కుందేటి ఉదయ నరసింహమూర్తి, అబ్బరాజు ఉదయ శంకర్, వలివేటి హర్ష వెంకట్, గౌరవ సలహాదారు పొడుగుపాటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు

మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు భవిత స్కూల్లో ఆదివారం అఖిల భారతీయ శిక్షా సమాగం ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాల బాలబాలికలకు మెడికల్ అసెస్మెంట్ సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖ అధికారి షేక్ అబ్దుల్ అలీమ్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష గుంటూరు వారి ఆధ్వర్యంలో 0 నుంచి 18 సంవత్సరాల లోపు వయసు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత శారీరక అంగవైకల్య నిర్ధారణ భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను చులకనగా చూడకుండా వారు ఎంచుకున్న రంగాలలో రాణించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బిడ్డల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారిలో మనోధైర్యాన్ని నింపాలని సూచించారు. తాడికొండ నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి 95 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఈడీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఐఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారులు రామ్మోహన్, సాజిదా బేగం, నియోజకవర్గంలోని పలు మండలాల భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, ఎన్.ఎలమంద, జ్యోతి, ఎన్.విజయలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో అలీమ్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తరలిరావాలి

మంగళగిరి: యూరియా కొరత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసేందుకు సోమవారం ఉదయం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్దకు తరలిరావాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవాలు



తెనాలి రూరల్: స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రైల్వే స్టేషన్లో ఆదివారం నిర్వహించారు. భారతీయ రైల్వేలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛత అభియాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 'స్వచ్ఛత పరిశుభ్రత' గురించి ప్రయాణికులకు ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.శారద అవగాహన కల్పించారు. అనారోగ్యం సంభవించినప్పుడు బాధపడడం కంటే అది రాకుండా చూసుకోవడం ముఖ్యమని.. ముందు జాగ్రత్త చర్యలతో ఎన్నో రోగాలను అరికట్టవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రమణ, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ సృజన, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పీడబ్ల్యూఐ, రైల్వే ఏఎస్ఐ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు స్టీవెన్, ఎస్.సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరరావు, నవనీతం, దుర్గమ్మ కూర్చొన్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, ఎన్.దుర్గారావు, బాషా, సుబ్బారావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.